క్లుప్తంగా

గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు

మద్దిపాడు: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు అందాయి. రేషన్ కార్డులో పేర్లు చేర్చుటకు ఐదు అర్జీలు, సర్వే సమస్యపై ఒక అర్జీ, రిజిస్ట్రేషన్‌లో అక్రమాలపై ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

అకాల వర్షంతో అపార నష్టం

కొత్తపట్నం: అకాల వర్షానికి పంటలు, ఉప్పుకొఠార్లు దెబ్బతిన్నాయి. వేరుశనగ మండీలు తడిసి ముద్దయ్యాయి. ఆరుగాలం కష్టం చేసి పంట చేతికి వస్తుందని అనుకునే సమయానికి వర్షం వచ్చి దెబ్బతింది. వేరుశనగ కాయలు వర్షానికి తడిసి పాడయ్యాయి. మండలంలోని గుండమాల, మోటుమాల, పాదర్తి, రంగాయపాలెం, కొత్తపట్నం, కె.పల్లెపాలెం, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం, ఈతముక్కల, మడనూరు గ్రామాల్లో ఇసుక నేలల్లో వేరుశనగ పంటను పండిస్తారు. మేలో పంటకు వచ్చి మండీలు తీస్తారు. మూడు రోజులు ఆరిన తర్వాత మిషన్ ద్వారా కాయలు తీస్తారు. ఇప్పుడు తడిసి కాయలు బూజు పడతాయని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో ప్రధానంగా విస్తీర్ణంలో ఎక్కువ భాగం రెండోదిగా ఉప్పుకొఠారు సుమారు రెండు వేల ఎకరాల్లో ఉప్పు సాగుబడి చేస్తారు. ఏడాదిలో సాగులో మేనెలలో అధిక ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున అధిక ఉత్పత్తి వస్తుంది. ఈ ఏడాది అకాల వర్షంతో పాటు శక్తి తుఫాన్ ప్రభావంతో అధిక వర్షం పడటంతో తీసిన ఉప్పు పూర్తిగా కరిగింది. ఒక్కో ఎకరానికి రూ.10 వేలు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఉప్పు కొఠారులో ఉన్న ఉప్పు పూర్తిగా కరిగిపోయింది. ఏడాదిలో జూన్ వరకు ఉప్పు ఉత్పత్తి వస్తోంది. రాత్రి కురిసిన వర్షానికి ఈ ఏడాదికి ఉప్పు ఉత్పత్తి ఆగిపోయి నట్టేనని రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది. ప్రభుత్వం పరిశీలించి వేరుశనగ, ఉప్పు రైతులను ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

హనుమాన్ శోభాయాత్రకు ఆహ్వానం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను హనుమాన్ శోభయాత్ర కమిటీ సోమవారం ఆహ్వానించారు. ఈనెల 22న కనిగిరిలో జరిగే హనుమాన్ శోభ యాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వద్దిపాటి వెంటేష్, కోడూరి పెద్దిరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి బొగ్గవరపు నవీన్, గంజి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

టంగుటూరు: రైతులు రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుము, జీలుగ , పిల్లిపెసర 50 శాతం రాయితీపై, నువ్వులు 40 శాతం రాయితీపై ఇస్తామన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సహాయకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జీఓ నంబర్-4పై పునరాలోచించాలి

కొండపి: ప్రభుత్వం జీఓ నంబర్.4పై పునరాలోచించాలని మండల రెవెన్యూ అధికారుల సంఘం సోమవారం తహసీల్దార్ మురళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సంఘ నాయకులు మాట్లాడుతూ ఒక సచివాలయానికి ఒక వీఆర్వో ఉండేలాగా నిర్ణయం తీసుకోవాని, లేకుంటే 2019 ముందు వరకు ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో ఒక రెవెన్యూ విలేజీకి ఒక వీఆర్ఓ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల ఒంగోలు డివిజన్ కార్యదర్శి గంగవరపు శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



చీమకుర్తి రూరల్: పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఒంగోలు: సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నగర కమిటీ నాయకులు

ఆదర్శప్రాయుడు.. పుచ్చలపల్లి సుందరయ్య

చీమకుర్తి రూరల్: నేటి తరానికి ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా నాయకుడు పమిడి వెంకటరావు అన్నారు. సోమవారం మండలంలోని కూనంనేనివారిపాలెంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. సురేష్ అధ్యక్షతన జిల్లా నాయకులు పమిడి వెంకటరావు, పూసపాటి వెంకటరావు, తదితరులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం పట్ల సమగ్ర అధ్యయనం చేసి ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గలమెత్తిన నాయకుడు సుందరయ్య అని కొనియాడారు. తన జీవితమంతా ప్రజాసేవకు, సమాజంలో మార్పునకు, ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.ఆంజనేయులు, బి.శ్రీను, టి.రామారావు, కె.చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ముందుకుసాగాలి

ఒంగోలు సిటీ: పుచ్చలపల్లి సుందరయ్య ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతూ నేటి తరానికి మార్గదర్శకం కావాలని సీపీఎం నాయకులు సూచించారు. సోమవారం సుందరయ్య భవన్‌లో మార్క్సిస్ట్ పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ ఘనంగా నివాళులర్పించింది. ప్రపంచంలో జరిగిన క్యూబా, వియత్నాం విముక్తి పోరాటాలను మించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య ఉద్యమ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఆయన సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూనాటి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం నేపథ్యంలో చేపట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో కేడర్‌ను రక్షించుకోవడం, ఆర్థిక వనరులు సమాకూర్చుకోవడం, కేడర్‌కు శిక్షణ వంటి బహుముఖ పనులు నిర్వహించడంలో సుందరయ్య అత్యంత కీలక భూమిక పోషించారని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన గెరిల్లా పోరాటం 3 వేల గ్రామాల్లో స్వయం పాలనకు దారి తీసిన వైనాన్ని గుర్తు చేసారు. ఈ ఉద్యమం ద్వారా 3 లక్షల ఎకరాలు భూములు పంపిణీ చేసిన సందర్భాన్ని ప్రస్తావించారు. పార్టీ అంతర్గత ఉద్యమ కాలంలో (1951–1964) గ్రామీణ ప్రాంతాల్లో స్వయంగా అధ్యయనం చేసి గ్రామీణ పేద రైతులు, వ్యవసాయ కార్మికుల ఉద్యమంలోకి రావాలని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు వై.సిద్దయ్య మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో మనుషుల మధ్య వైరుధ్యాలు సృష్టిస్తున్న మతోన్మాదులను వర్గ చైతన్యంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వర్గ పోరాటం ద్వారానే సమాజ మార్పు చెందుతుందన్న మార్క్సిస్టు, లెనినిస్ట్ సూత్రాలను అమలు చేయడం ద్వారా రుజువు చేసిన సుందరయ్య ఆశయాలను కొనసాగించాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ సుందరయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బి.రఘురామ్, కంకణాల రమాదేవి, పార్టీ నాయకులు గంటినపల్లి శ్రీనివాసులు, సీహెచ్ వినోద్, కేఎఫ్ బాబు, జి.నరసయ్య, కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నగర కమిటీ ఆధ్వర్యంలో..

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను, సిద్ధాంతాలను ఆచరించడమే ఆయనకు అర్పించే నివాళి..అని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో పలుచోట్ల పార్టీ పతాకాలు ఆవిష్కరణ చేశారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీనగర్, భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నగర కమిటీ నాయకులు సయ్యద్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ ప్రథమ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, స్వాతంత్ర సమరయోధునిగా, పీడిత ప్రజల విముక్తి కోసం నిరంతరం శ్రమించిన సుందరయ్య కమ్యూనిస్టులకు ఆదర్శనీయుడని పేర్కొన్నారు. రాజకీయాలను వ్యాపారం చేస్తూ విలువలను కాలరాస్తూ డబ్బు సంపాదన ధ్యేయంగా రాజకీయాలు నడుపుతున్న తరుణంలో ప్రజాసేవ, నిస్వార్థం, త్యాగం, ఎంతో మందికి ఆదర్శవంతంగా నిలిచిన సుందరయ్య నేటి యువతరానికి వేగుచుక్క లాంటివారన్నారు. ప్రజా ఉద్యమాలతో పాటు ప్రజలకు సేవ, సహాయ కార్యక్రమాలు చేపట్టారని, పార్లమెంటు సభ్యునిగా సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లడం ఆయన నిరాడంబరత్వాన్ని నాటి ప్రధాని నెహ్రూ ప్రశంసించిన వైనాన్ని గుర్తు చేశారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆనాడే నీటి వనరు గురించి, భూములు గురించి ప్రజాప్రణాళికని రూపొందించారని పేర్కొన్నారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసరావు, నాయకులు దామా శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు కొర్నెపాటి శ్రీనివాసరావు, ధారా వెంకటేశ్వర్లు, జి.ఆదిలక్ష్మి, టి.మహేష్ పాల్గొన్నారు.



ఒంగోలు: సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- మద్దిపాడు తహసీల్దార్ నారాయణరెడ్డి

మద్దిపాడు: మండల పరిధిలో గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ ఎస్.నారాయణరెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని గుండ్లకమ్మ నదీ పరివాహక గ్రామాలైన కొలచనకోట, మల్లవరం, వెల్లంపల్లి, మద్దిపాడు, కీర్తిపాడు, తదితర గ్రామాలను తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎస్‌ఐ బి.శివరామయ్య సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. ఆర్‌ఐ పీవీ రమణయ్య, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా...

అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. ఇసుకను అక్రమంగా రవాణా చేసే వాహనాలను పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టుకున్న సమయంలో రాజకీయ పలుకుబడి ఉన్న నాయకుల సహకారంతో అక్రమార్కులు వెంటనే తమ వాహనాలకు తూతూమంత్రంగా జరిమానాలు కట్టి తీసుకెళ్తున్నారు. వాహనాలు విడుదలైన వెంటనే మళ్లీ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి పీడీ యాక్ట్‌పై కేసు నమోదు చేయగలిగినప్పుడే అక్రమ రవాణా ఆగుతుందని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి రాజకీయాలకు అతీతంగా కేసుల నమోదు చేస్తేనే ఇసుక అక్రమ రవాణా ఆగుతుందని భావిస్తున్నారు. కొంతమంది రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారంతో కూడా ఇసుకఅక్రమ రవాణా సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



వెల్లంపల్లి ఫ్లైఓవర్ కింద ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

జీవో నంబర్ నాలుగుకు వ్యతిరేకంగా అర్జీ

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జీవో నంబర్ నాలుగు వలన సచివాలయాల కుదింపుతో పనిభారం అధికమవడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా వీఆర్‌ఓ పోస్టులు ఖాళీ అవుతాయని, ప్రభుత్వం దీనిపై స్పందించి సవరించాలని కోరుతూ సంతనూతలపాడు మండల వీఆర్వోల సంఘ నాయకులు సోమవారం సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేశారు. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, ఎంపీడీవో డి.సురేష్ బాబుకు వినతిపత్రం అందజేసిన వారిలో వీఆర్వోల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసీ ఆదిరెడ్డి, రాష్ట్ర నాయకుడు కె.రవికుమార్, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, జిల్లా, మండల వీఆర్వోల సంఘ నాయకులు జి.వినీల, వినోద్‌కుమార్, కసుకుర్తి జాలయ్య, ముంతాజ్, మధుబాబు, దాసరి శ్రీనివాసులు, హనుమంతరావు ఉన్నారు.



అధికారులకు అర్జీ అందజేస్తున్న వీఆర్వోల సంఘ నాయకులు

విద్యార్థిపై దాడి కేసులో నిందితులను అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నీలం నాగేంద్రరావు, దళిత నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసి మూత్రం తాగించిన కేసులో నిందితులైన అగ్రకుల రౌడీలను అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సమితి కార్యాలయం వద్ద సోమవారం నిరశన వ్యక్తం చేశారు. నాగేంద్రరావు మాట్లాడుతూ సినీహీరో మోహన్‌బాబుకు చెందిన తిరుపతిలోని శ్రీ విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో నెల్లూరు జిల్లా రెడ్డిపాలేనికి చెందిన జేమ్స్ అనే బీటెక్ ఫైనల్ విద్యార్థిని కొందరు అగ్రకుల విద్యార్థులు ఈ నెల 16న కిడ్నాప్ చేసి తీవ్రంగా కొట్టడమే కాకుండా మూత్రం తాగించారన్నారు. ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్ర హోంమంత్రి ప్రత్యేక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిందితులు రౌడీషీటర్ సాయి రూపేష్, చోటా బ్లడ్ గ్యాంగ్ ముఠాను కఠినంగా శిక్షించాలన్నారు. నిందితులకు కూటమి నాయకుల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. బాధితుడు తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. గతంలో ఇలాంటి సంఘటనే ఒంగోలులో జరిగినప్పుడు సరిగ్గా స్పందించని పోలీసులను అప్పటి ప్రభుత్వం సస్పెండ్ చేసిందని నాగేంద్రరావు గుర్తు చేశారు. తిరుపతి పోలీసులపై కుడా విచారణ చేయాలన్నారు. అగ్రకులానికి చెందిన వీరయ్య హత్యకు గురైతే అప్పటికప్పుడు ఒంగోలుకు వచ్చిన హోం మంత్రి.. ఇంజినీరింగ్ విద్యార్థి సంఘటనపై స్పందించాలన్నారు. దళిత నాయకులు దారా అంజయ్య, రవి, దళిత మహాసభ నేతలు దుగ్గిరాల విజయకుమార్, చింతల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకునికి నివాళులు



జయరావుకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి రూరల్: మండలంలోని చీమలమర్రి గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మాగులూరి జయరావు మూడో వర్ధంతి సందర్భంగా సోమవారం ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, మంచికలపాడు ఎంపీటీసీ అత్యాల అంకయ్య, చీమకుర్తి మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, మాగులూరి వెలుగొండయ్య, మాగులూరి ప్రసాదు, రావినూతల బెన్ని, వరబాబు తదితరులు పాల్గొని పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.

జోరు వానలో శ్రీగిరి ప్రదక్షిణ



ఒంగోలు కొండపై శ్రీగిరి ప్రదక్షిణలో భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి ప్రదక్షిణ సోమవారం ఉదయం వైభవంగా జరిగింది. అల్పపీడన ద్రోణితో జోరు వర్షం పడుతున్నా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణను కొనసాగించారు. తొలుత శ్రీగిరి పాదపీఠం వద్ద బాపూజీ గో సంరక్షణ శాల ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించి తులసి, గన్నేరు, మందార, మల్లెల మాలలతో శోభాయమానంగా అలంకరించిన పల్లకిపై శ్రీనివాసుని స్థిరపరిచి భక్తులు గోవింద నామాలు చదువుతూ తమ భుజస్కందాలపై పల్లకిని మోస్తూ స్థానిక కోర్టు సెంటర్, జిల్లా కేంద్ర గ్రంథాలయం, కేశవస్వామిపేట, భగీరథ మహర్షి సెంటర్, వేప అంకమ్మ తల్లి ఆలయం, శర్మ కాలేజీ, క్రికెట్ గ్రౌండ్ గద్దలగుంట, రాజా పానగల్ రోడ్డు మీదుగా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైయున్న శ్రీగిరి చేరి శ్రీవారిని దర్శించి తన్మయత్వం చెందారు. శ్రీగిరి గిరి ప్రదక్షణ కమిటీ అధ్యక్షుడు రాధారమణ గుప్తా జంధ్యం మాట్లాడారు. గిరిప్రదక్షిణ కమిటీ కోశాధికారి వలేటి కృష్ణారావు, శనెగేపల్లి నాగాంజనేయులు, శనగపల్లి కిషోర్, గోసంఘం వాసు, పతంజలి శ్రీనివాస్, తుమ్మపూడి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎయిడ్స్ మృతుల జ్ఞాపకార్థం క్యాండిల్ లైట్ డే



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఒంగోలు సిటీ: ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో మరణించిన వారి జ్ఞాపకార్థం క్యాండిల్ లైట్ డేను ఆదివారం నిర్వహించినట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంగోలు దిశ ఆఫీసు నుంచి చర్చి సెంటర్ వరకు కాండిల్ లైట్ డే ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో మరణించిన వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం మే మూడో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. సీపీఎం కిరణ్, స్వచ్ఛం సంస్థ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



దేవతామూర్తుల ప్రతిష్టలో వేదపండితులు



ప్రతిష్ట మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్ట

ఒంగోలు మెట్రో: బలరాం కాలనీ, పొనుగుబాటి కాలనీలోని దుర్గా మల్లేశ్వర, వేంకటేశ్వర ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను అంగరంగ వైభవంగా జరిపించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు వేద పండితులు డాక్టర్ శ్రీమాన్ దీవి అనీల్‌కుమార్ భట్టాచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, అగ్ని ప్రణయనం, విశేష శాంతి హోమాలు జరిపించారు.

సమ్మర్ క్యాంప్‌లతో ఉపయోగం

ఒంగోలు మెట్రో: ఆర్‌ఎస్‌ఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు ఒంగోలు డీఆర్‌ఎంఎం మున్సిపల్ హైస్కూల్లో 20 రోజుల నుంచి ఉచితంగా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు చిక్కాల కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి శిబిరాలతో మేలు జరుగుతుందని చెప్పారు. వేసవిలో విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్‌లకు బానిసలు కాకుండా వారిలోని సృజనాత్మకతను బయటకు తీసేందుకు సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయని తెలిపారు. శిబిరంలో విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలతో పాటు వాలీబాల్, కర్రసాము, క్రికెట్, మార్షల్ ఆర్ట్స్ నేర్పించడం అభినందనీయమన్నారు. బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సినీ నటుడు దన్నారపు మస్తాన్‌రావు, మద్దులూరు శ్రీనివాసరావు, బాబురావు పాల్గొని విద్యార్థులను అభినందించారు



సమ్మర్ క్యాంప్‌నకు హాజరైన విద్యార్థులు, అతిథులు



పంచముఖ ఆంజనేయస్వామి

పూలంగి సేవలో ఆంజనేయుడు

ఒంగోలు మెట్రో: జిల్లా వ్యాప్తంగా హనుమజ్జయంతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఒంగోలు కేశవ పేటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానం, లాయరుపేట చిట్టి ఆంజనేయ స్వామి మందిరం, ముంగమూరు డొంక మర్రిచెట్టు కాలనీలోని పొలిమేర అభయాంజనేయ స్వామి, ముంగమూరు డొంక సుందర నగరంలోని పంచముఖ ఆంజనేయ దేవస్థానం, గద్దలగుంటలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, ఒంగోలు మాత శిశు వైద్యశాల దగ్గర వీరాంజనేయ స్వామి దేవస్థానం, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో అభయాంజనేయ స్వామి దేవస్థానంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ముంగమూరు డొంక సుందర నగరంలో పంచముఖ ఆంజనేయ స్వామికి మూల విరాట్‌కు సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు.



స్వామివారి దర్శనంలో భక్తులు